జయజయ శంకర



హరహర శంకర

శాంకర సంవత్సరం 2533

సంపుటి : 3 సంచిక : 12

# శ్రీ కామకోటి వాణి

శ్రీ విశ్వావసు మార్గశిర మాసం, డిసెంబర్ 2025



శ్రీ కంచికామకోటి పీఠం, కాంచీపురము




# గంగాపార్వతీ సమేత కోటేశ్వరస్వామి ఆలయ సందర్శన

సర్వమంగళ మాంగళ్యే శివే సర్వార్థసాధికే
శరణ్యే త్ర్యయంబకే దేవి నారాయణి నమోస్తుతే ॥
మాతాచ పార్వతీదేవి పితాదేవో మహేశ్వరః
బాంధవాః శివభక్తాశ్చ స్వదేశో భువనత్రయమ్ ॥

శ్రుతిస్మృతి పురాణానాం ఆలయం కరుణాలయం
నమామి భగవత్పాద శంకరం లోక శంకరం ॥
సదాశివసమారంభాం శంకరాచార్య మధ్యమాం
అస్మదాచార్య పర్యంతాం వందే గురు పరంపరాం ॥

కార్తీకమాసంలో స్థిరవాసం(శనివారము) రోజు చెరుకూరు గ్రామంలోని 'గంగాపార్వతీ సమేత కోటేశ్వరస్వామి ఆలయ సందర్శన చేసుకోవడం విశేషమైన అవకాశము. మన భారతదేశ మనే పేరు కొత్తగా పెట్టుకున్నది కాదు. పురాణకాలం నుండీ ఉన్నదే. భారతదేశం చాలా గొప్ప దేశం. ఎందుకంటే వెండి, బంగారం లాంటి విలువైన వస్తువులు వున్నాయా అని కాకుండా, బంగారం లాంటి స్వభావం కలిగిన మనుషులున్న దేశం. బంగారంలా స్వచ్ఛమైన, నిర్మలమైన మనుషులు ఇక్కడ నివాసం




ఉంటున్నారు. ప్రపంచ వ్యాప్తంగా మనుషులు పుడుతూ ఉంటారు. ఉద్యోగాలు, వ్యాపారాలు, తిండి, నిద్ర, పిల్లలు అందరికీ సాధారణమే. పశు పక్ష్యాదులకైనా ఈ విషయం సమానమే. కాని భగవంతుడు మనుషులకు ప్రత్యేకంగా 'వివేకం' అనే విద్యని ఇచ్చారు. కాబట్టి మంచి, చెడు అని తెలుసుకొని ఉండాలి. మనవాళ్ళు అందరూ మంచిగా వుండాలి అని కోరుకోవడం ఇక్కడి ప్రజలకు ఉండే సుగుణం. కుటుంబంలో ఎవరు గుడికి వెళ్ళినా, మిగిలిన బంధువుల కుటుంబాలలో వివాహం, చదువు, ఆరోగ్యం చక్కగా ఉండాలని కోరుకుంటారు. ఇది భారతీయ సనాతన వైదిక హిందూధర్మం.

విదేశీయులకు ప్రధానంగా కొన్ని కోరికలు ఉంటాయి. తను ఆస్తిపరుడుగా ఉండటంతో పాటు తను ఉండే ప్రాంతంలో కూడా తన అధికారమే చెల్లుబాటు కావాలని కోరుకుంటాడు. అందుకే ఎక్కడో వున్న వాళ్ళు వ్యాపారం చేయడమనే పేరుతో ఈ దేశం వచ్చి తర్వాత అధికారం సంపాదించి సుసంపన్నం అయినారు. విదేశం నుంచి వచ్చి మీ భాష, కట్టు, బొట్టు, జుట్టు పనికిరానివి. మా సంస్కృతే సరియైనదని చెప్పి ప్రభావితం చేయడానికి ప్రయత్నం చేశారు. ఈ వ్యవసాయం, మట్టిపని, చేనేతలు అభివృద్ధి కాదు అని చెప్పారు.

మనదేశంలో ఆర్థిక నీతి, జ్ఞానం, విజ్ఞానం పూర్వం నుండి ఉంది. భారతీయులు తెలివితేటలు లేనివారు కాదు. ఆయుర్వేదం, జ్యోతిష్యం వంటి గొప్ప శాస్త్రాలలో నిష్ణాతులైన పండితులు ఉండేవారు. పంచాంగంలో సౌర,చంద్రమానాలు, చంద్ర, సూర్యగ్రహణాల అన్నిటి సమాచారాలు ఉండేవి. టైప్ రైటర్, కంప్యూటర్, టెలివిజన్ ఏమీ లేని సమయంలో మనదేశంలో విజ్ఞానం ఉన్నది. ప్రత్యక్ష దర్శనం 'దృక్' సిద్ధాంతం, వాస్తు, గణితశాస్త్రం ద్వారా పెద్ద పెద్ద కోటలు, గుళ్ళు కట్టారు. మన స్వదేశీ విజ్ఞానంతో కృష్ణదేవరాయలు, చోళులు, పల్లవులు వంటి రాజులు పెద్ద పెద్ద గాలిగోపురాలతో అనేక ఆలయాలు నిర్మించారు. ఆ సమయంలో నీతి నిజాయితి ఉన్నది. అన్నీ ఉన్నా కూడా మన వాళ్ళందరికి విదేశీ సంస్కృతి మంచిగా అనిపించి, మోహంలో పడి దుర్బలమై దేశం పరాధీనమయింది. ఆస్తిపాస్తులే కాక మన చదువు, కుటుంబవ్యవస్థ, చివరకు ధర్మాన్ని కూడా పోగొట్టుకున్నాం. మన అభిప్రాయాలు, అధికారం అన్యాక్రాంతమయినాయి. అలా ఉన్న ఈ దేశాన్ని, ధర్మాన్ని కాపాడటానికి భగవంతుడు అప్పుడప్పుడు అవతరిస్తున్నందు వల్లనే ఇంతవరకైనా మిగిలింది. దేశంలో ఇంకా కొద్దిపాటి ధర్మము, సంస్కృతి, సదాచారము, గౌరవాలు, మర్యాద, భక్తి, సేవా కార్యక్రమాలు మిగిలాయంటే దానికి కారణం భగవంతుడే!

ఆ వైకుంఠంలో ఉండే భగవంతుడు దిగివచ్చి మత్స్యావతారము, కూర్మావతారము, బలరామావతారము, రామావతారము, కృష్ణావతారము, కల్కి అవతారము వంటి అనేక అవతారాలను ధరించి మన మధ్యనే సంచరించి మనలో ఒక మనిషిలాగా దేశంలో ధర్మము, భక్తి, సదాచారము, నైతికవిలువలు, నీతినిజాయితీలను నిలబెట్టారు. నైతికవిలువలు అనేవి మానవజీవితంలో చాలా ముఖ్యము. ఆరోజు రాములవారు అనుకొనివుంటే అయోధ్యలోనే ఉండేవారు. ఆయనకు ఆ పరాక్రమము, శక్తి ఉన్నాయి. లక్ష్మణుడు కోపంగా ఉన్నా రాములవారు అందరిని ఒప్పించి వనవాసానికి వెళ్ళారు. వనవాసం వెళ్ళే సందర్భం గురించి ఒక కవి మాట్లాడుతూ **"వివేశ దండకారణ్యం ప్రత్యేకం చ సతాం మనః"** అని చెప్పారు. – రాములవారు వనవాసంలోనే కాదు ఈ దేశంలోని

సహృదయులందరి హృదయాలలో ఈరోజు ప్రవేశించారు అని అర్థం. వారు ధైర్యం, శౌర్యం, పరాక్రమముతో వెళ్ళారు. మహాపతివ్రత సీతాదేవి ఆయనను అనుసరించింది. అరణ్యవాసంలో కూడా వారు ఆదర్శవంతంగా ఒకరి మనస్సుల్లో ఒకరు ఉంటూ, ప్రేమకు, సౌజన్యానికి, దాతృత్వానికి, బాధ్యతకు ఒక ఉదాహరణగా నిలిచారు. దేశంలో దుష్టశక్తులకు బలం చేకూరకుండా మహర్షులను, మహనీయులను కాపాడుతూ రామరాజ్యాన్ని స్థాపించారు. రామరాజ్యంలో ప్రజల మధ్య తారతమ్యం లేకుండా అందరి మనసుకూ సంతోషం కలిగేలా రాజ్యభారాన్ని నిర్వహించారు.



రామరాజ్యం అంటే అందరికీ సమానంగా న్యాయం, సుభిక్షం, ప్రేమ, స్నేహం అందడమే. సుఖం – సుముఖం అంటారు. కొందరు సుఖంగా ఉంటారు కాని సుముఖంగా ఉండరు. అందరూ సుఖంగాను, సుముఖంగాను వుండాలి అనేది రామరాజ్య సందేశం.

అరణ్యవాసంలో ఎన్నో ఆశ్రమాలకు వెళ్ళారు. అలా వెళ్తూ భరద్వాజ ఆశ్రమానికి కూడా వెళ్ళారు. తరువాత గంగానదిని దాటడానికి అడవికి రాజైన గుహుడిని కలిసినప్పుడు, ఇప్పటివరకు మేము నలుగురు సోదరులము. ఇప్పుడు నీతో కలిపి ఐదుగురుము అయినాము అని తెలపడంలో రాములవారికి గల గొప్ప మనసు తెలుస్తుంది. అలహాబాదులో ప్రయాగ ప్రక్కన శృంగభేరీపురంలో రాములవారు స్నానం చేసి జటాధారణం చేశారు. ఒక మహారాజు అయినా ఋషిలాగా తపస్సు చేస్తూ అడవిలో సంచారం చేశారు.

దండకారణ్యంలో వాతాపి, ఇల్వలుడు అనే రాక్షసులు ఉండేవారు. అతిథులను ఇంటికి భోజనానికి పిలిచి వాతాపిని వండి పెట్టేవారు. భోజనం అవగానే ఇల్వలుడు వాతాపిని బయటకు రా అని పిలవగానే కడుపు చీల్చుకొని బయటకు వచ్చేవాడు. దాంతో ఆ వచ్చినవారు మరణించేవారు. అప్పుడు వాళ్ళని వీరు ఇద్దరు భోజనం చేసేవారు. ఒకసారి అగస్త్యమహర్షిని భోజనానికి పిలిచారు. ఆయన గొప్ప తపస్సంపన్నులు కనుక వీళ్ళ మాయ తెలుసు. ఆయన భోజనం అవగానే 'వాతాపి జీర్ణో భవ' అని కడుపులో ఉన్న వాతాపి అనే రాక్షసుడిని జీర్ణం చేసుకున్నారు. ఆవిధంగా ఆ రాక్షసుడు మరణిస్తాడు. ఈవిధంగా ఉన్న దండకారణ్యంలో రాములవారు సంచరిస్తున్నప్పుడు ఋషులను, మునులను కాపాడుతూ, జనకమహారాజు కూతురు జానకమ్మతో కలిసి పర్ణశాలలో నివసించేవారు. ఒకసారి సీతమ్మతల్లి 'మనం వనవాసం కొరకు వచ్చాము, మనకు విల్లుబాణాలు, రాక్షస సంహారాలు అవసరమా' అని అడిగినప్పుడు, రాములవారు దీన్ని కర్తవ్యనిర్వహణగా అందరినీ కాపాడాలని చెప్పారు. అడవిలో కూడా అందరికీ సహాయసహకారాలు అందజేశారు. అయోధ్యలో భరతుడు రాజ్యభారం నిర్వహిస్తుండగా, ఈయన ఇక్కడ ధర్మసంరక్షణ చేశారు. భరతుడు కూడా ఆశతో రాజ్యాన్ని తీసుకోలేదు. ఇద్దరూ మహర్షుల్లాగా ఉన్నారు. ఒక కవి వర్ణిస్తూ ఎవరు గొప్పవారు? సీతాదేవా? భరతుడా? అంటే ఇద్దరూ గొప్పవాళ్ళే!

'లంకేశ్వర ప్రణతి భంగ దృఢవ్రతం చ చందయుగం చరణయోహో జనకాత్మజాయ జేష్ఠా

వృత్తి జటిలంచ శిరోస్య సాధోహు అన్యోన్య పావన మభూత

ఉభయం సమేత్య'


సీతాదేవి ఒంటరిగా లంకాద్వీపంలో ఉన్నప్పుడు ఎవరి సహాయసహకారాలు లేవు. భయపెట్టే రాక్షసులలో త్రిజట అనే రాక్షసి మాత్రమే సీతామ్మవారికి, 'అమ్మా! నీవు ఏమి బెంగపెట్టుకోవద్దు, నీకు మంచి జరుగుతుంది' అని చెప్తూ ఉండేది. రావణాసురుడు ఎంత భయపెట్టినా, ఆశపెట్టినా అమ్మవారు ధృడంగా ఉండి, తన వ్రతాన్ని ఆచరించారు. ఇంకోవైపు ఏ ఆడంబరాలు వద్దు అని చెప్పి అన్నీ త్యజించి పాదుకారాధన చేస్తున్న భరతుడు! ఈ ఇద్దరిలో ఎవరు గొప్పవారు అంటే, ఇద్దరూ గొప్పవారే! ఇద్దరు మంచివాళ్ళు కలిస్తే ఆ ప్రదేశం పావనమవుతుంది అని వాల్మీకి రామాయణం ద్వారా తెలుసుకున్నాము. అలాంటి పవిత్రమైన సంస్కృతి గల ధర్మభూమి మనదేశం.

ఈ భూమిలో ఈ సారం ఉండటానికి కారణం పుణ్యనదులు ప్రవహించడం. 'గంగేచ యమునేచైవ గోదావరి సరస్వతి నర్మదే సింధు కావేరి జలేస్మిన్ సన్నిధిం కురు' పుణ్యతీర్థాలలో గోదావరి, కృష్ణవేణి ఉన్నాయి. నదీమూలం, ఋషిమూలం అంటారు. ఋషులు ఎవరు, ఎక్కడి నుంచి వచ్చారు అనేది మనం తెలుసుకోలేము. నదీమూలం కూడా ఎక్కడో ఒక ప్రాంతం నుండి బహిర్గతం అవుతూ కనిపిస్తుంది. (హిమాలయాలలో గంగోత్రి అనే ప్రాంతం నుండి గంగ ప్రాచుర్యం అవుతున్నది.) మనం సాధారణంగా కొన్ని పదాలు అప్రయత్నంగా వాడుతూ ఉంటాము. భీష్మప్రతిజ్ఞ, భగీరథప్రయత్నం, దూర్వాసకోపము, విశ్వామిత్రశాపము, నారదకలహం అని చెప్తూ ఉంటాము. వాటిని వేరుగా అర్థం చేసుకుంటున్నాము కూడా. నారదకలహం అంటే ఆ కలహం మంచి జరగడం కోసమే. 'హిరణ్యాయనమః' అని చెప్తున్న చోటికి వెళ్ళి కృష్ణభక్తి ప్రచారం చేశాడు నారదుడు. దూర్వాసుడు కైలాసానికి వెళ్ళి పార్వతిపరమేశ్వరులని సందర్శించి అక్కడి పుష్పమాల, ప్రసాదాన్ని తీసుకువచ్చి ఇంద్రుడికి ఇచ్చారు. ఆయన దాన్ని గౌరవించలేదు. ప్రసాదాన్ని ఇచ్చినప్పుడు దాన్ని సరిగా గౌరవించాలి. శివానందలహరిలో శంకరాచార్యులవారు చెప్తూ 'గృహీత్వా హస్తాభ్యాం శిరసి నయనే వక్షసి వహన్ సమాశ్లిష్యాఘ్రాయ స్ఫుట జలజ గంధాన్ పరిమళాన్' ప్రసాదాన్ని తీసుకున్నప్పుడు కంటికి అద్దుకొని తలలో పెట్టుకోవాలి. (పిల్లలను గుడికి తీసికెళ్ళినప్పుడు, ప్రసాదం ఇచ్చినప్పుడు, అక్కడ ఏదో ఒక సేవ చేయడం, డబ్బులు వేయడం, బొట్టు పెట్టుకోవడం, అన్నీ మనం అలవాటు చేస్తాము.) ఇంద్రుడు శివపార్వతుల ప్రసాదాన్ని ఐరావతం



(ఏనుగు) మీద పడేశాడు. అందువల్ల దూర్వాసుడికి కోపం వచ్చింది. ఇంద్రుని క్షేమం కోరి పరమేశ్వరుడి ప్రసాదాన్ని అందించారు. ఎవరిని ఎలా గౌరవించాలో వారిని గౌరవించటం అనేది భారతీయ సంస్కృతి.

ఇంకో కథలో కపిలమహర్షి పాతాళంలో కూర్చుని తపస్సు చేసుకుంటుంటే అశ్వమేధయాగం జరిగిన అశ్వాన్ని తీసుకొచ్చి అక్కడ కట్టేశారు. వెతుక్కుంటూ వచ్చిన సగరపుత్రులు కపిలమహర్షిని అన్యథా భావించి ప్రశ్నించారు. ఆయన నాకు సంబంధం లేదన్నా అనుమానించారు. ఫలితంగా శాపగ్రస్తులు అయ్యారు. ఈ కష్టం నుంచి సద్గతి పొందాలని ప్రాయశ్చిత్తం పరిహారం మునినే అడిగారు. మనధర్మంలో అనుగ్రహాలు ఉంటాయి. ఏదైన పొరపాట్లు, ప్రమాదాలు జరిగినా, కష్టం వచ్చినా, ప్రాయశ్చిత్తం పరిహారం



అని దాని నుండి బయటపడటానికి మార్గం కూడా చెప్పారు. అందరిని మంచిగా చూసే ధర్మం మనది. స్వర్గలోకంలో వుండే గంగాదేవిని భూలోకానికి తెప్పిస్తే నీ పూర్వీకులైన సగరులకు సద్గతి లభిస్తుంది అని చెప్పారు. మనము సౌఖ్యంగా ఉండటం కాకుండా మన తాతముత్తాతలకు ఉత్తమగతులు రావాలని, అలాగే ముందుతరాలు కూడా బాగుండాలని కోరుకుంటాము. మన వంశగౌరవం, ఇంటిగౌరవం గ్రామగౌరవం నిలుపుకోవాలని అనుకుంటాము. భగీరథుడు అనేక సంవత్సరాలు తపస్సు చేసి పరమేశ్వరుని సాక్షాత్కారం పొందిన తరువాత పరమేశ్వరుని ద్వారా బ్రహ్మ అనుగ్రహంతో గంగను భూమి మీదకు తేగలిగాడు. ఆ నది వేగంగా ఆకాశం నుండి భూమి మీదకు వస్తుంటే ఎవరూ తట్టుకోలేక పోయారు. ఆ భారం తట్టుకోవడానికి ధైర్యం, శక్తి కావాలి. మళ్ళీ పరమేశ్వరుని ప్రార్థించారు. ఆయన తన జటాజూటంలోకి ఆ గంగాదేవిని తీసుకున్నారు. అందుకే పరమేశ్వరునికి గంగాధరుడు అనే పేరు వచ్చింది. దాని తరువాత ఆ గంగాదేవిని భూలోక ప్రవాహంగా వదిలారు. గంగాతీర్థంలో ఈనాటికీ మహాకుంభమేళాలు జరుగుతుంటాయి. 'గంగా' అని చెప్పుకున్నా పుణ్యం వస్తుంది. అలా చెరుకూరులో ఉండే అమ్మవారి పేరు గంగాపార్వతి. గంగా స్మరణం అనేది ప్రతినిత్యము హిందువులు చేసుకోవాలి. హిందువులలో ఏ కులానికి చెందినవారికైనా గంగా, గోవు రెండూ చాలా ముఖ్యమైనవి. పూజలలో కలశపూజ చేస్తారు. రాగిచెంబులో నీరు పోసి ఆ నీరులో గంగాదేవి ఉన్నట్లుగా భావించి 'గంగేచ యమునేచైవ గోదావరి సరస్వతి నర్మదే సింధు కావేరి జలేస్మిన్ సన్నిధిం కురు' అని భగవంతుని సన్నిధానం, సాన్నిధ్యం ఈ కలశంలో ఉండాలి అని కోరుకుంటారు. అలాంటి గొప్ప మహిమాన్వితమైనది గంగాదేవి. ఆ రోజుల్లో కాశీ, రామేశ్వర యాత్ర నడిచి వెళ్ళేవాళ్ళు. అది గొప్ప కష్టమైన, ఇష్టమైన విషయం కూడా. అపురూపంగా కొందరు మాత్రమే వెళ్ళేవారు. ఈ రోజుల్లో విమానాలు వచ్చేశాయి. అందరు కాశీ, ప్రయాగ వెళ్ళి వస్తున్నారు. కొందరు గర్భవాసం అని అక్కడ 10నెలలు ఉండి వస్తారు. కొందరు 40రోజులు మండల దీక్షగా ఉండి వస్తున్నారు. అలా కాశీకి, గంగకి నిత్యసంబంధం చక్కగా ఏర్పడింది.

గంగాపార్వతీ సమేత కోటేశ్వరస్వామి : మనుష్యుల్లో ధనవంతులు ఉంటే కోటీశ్వరుడు అంటారు. కాని కోటి అనే పదానికి వేరే పారమార్థిక అర్థాలు కూడా ఉన్నాయి. మన కంచిలో ఈ 'కోటి' మూడు చోట్ల ఉన్నది. శివకంచిని 'రుద్రకోటి', విష్ణుకంచిని 'పుణ్యకోటి', కామాక్షీ అమ్మవారిని 'కామకోటి' అని అంటారు. అదే కంచి కామకోటి పీఠం. కామకోటిపీఠం అంటే శ్రీచక్రయంత్రం. ఆ కామకోటేశ్వరుడే ఇక్కడ కోటేశ్వరస్వామిగా లింగరూపంలో ప్రతిష్ఠించబడ్డాడు. ఆదిశంకరాచార్యులవారు కొన్ని పుణ్యక్షేత్రాలలో యంత్రాలను స్థాపితం చేశారు. కంచి కామాక్షీ అమ్మవారి సన్నిధిలో శ్రీచక్రాన్ని స్థాపితం చేశారు. శ్రీరంగం ప్రక్కన అఖిలాండేశ్వరి అమ్మవారి గుడిలో అమ్మవారి తాటంకాలు (చెవికి పెట్టుకునే ఆభరణం)శ్రీచక్రరూపంలో ప్రతిష్ఠ చేశారు. ఆ తాటంక మహిమ వల్లనే విషం తాగిన పరమేశ్వరుడు మృత్యుంజయుడుగా ఉన్నాడని శంకరాచార్యులవారు చెప్పారు.

'సుధామప్యాస్వాద్య' – దేవతలు అమృతాన్ని తాగారు. అయినప్పటికి కూడా అప్పుడప్పుడు ఇబ్బంది పడుతున్నారు. కాని కాలకూటవిషాన్ని తాగిన నీలకంఠుడైన పరమేశ్వరునికి ఏ ఇబ్బంది లేదు. మేరుపర్వతానికి వాసుకిని చుట్టి ఒకవైపు దేవతలు ఒకవైపు అసురులు పట్టుకొని సముద్ర మథనం చేశారు. దాని నుంచి అమృతం వచ్చింది. మహావిష్ణువు మోహినీ అవతారంలో వచ్చి అందరికి పంచి పెట్టారు. అప్పుడే రాహువు, కేతువు అనేవారు తయారయ్యారు. అప్పటి నుంచి వాళ్ళకు కూడా స్థానం ఇచ్చి, ప్రదక్షిణాలు, పూజలు చేస్తున్నారు. హిందూమత చరిత్ర ఇది.



హిందువులు, 1500, 2000 సంవత్సరాల ముందు పుట్టినవాళ్ళు కాదు. యుగయుగాలుగా ఈ దేశానికి సంబంధించినవారు. హిందువులందరు భాషాద్వేషం లేకుండా ప్రతివారికి మంచి జరగాలని ప్రార్థిస్తారు. అదే 'లోకాః సమస్తాః సుఖినో భవంతు' తాత్పర్యం.

ఇక్కడున్న కోటేశ్వరస్వామి, కోటిపుణ్యాలు ఇచ్చే స్వామిగా వెలసి ఉన్నాడు. ఇక్కడ ఉసిరిచెట్టు, జమ్మిచెట్టు, కొబ్బరిచెట్లు ఉన్నాయి. ఈ శిఖరాని వెనకాల చామరం వీస్తున్నట్లుగా కొబ్బరిచెట్టు చక్కగా ప్రకృతి రమణీయంగా ఉన్నది. చెరకు అంటేనే బాగా తీయనిది. చెరుకూరు అంటే ఇక్షుసాగరం. ప్రతిపర్వరసోదయం అన్నట్లుగా చెరకు ప్రతి కణుపులో మాధ్యుర్యం ఉంటుంది. అలా ఈ ఊరిలో మహాలక్ష్మి అమ్మవారి గుడి, గంగాపార్వతీ సమేత కోటీశ్వరస్వామి గుడి, త్రివిక్రమస్వామి గుడి ఉన్నాయి. వామనావతారం మూర్తి చిన్నది కీర్తి పెద్దది అంటారు. ఎవరైనా కష్టంలో ఉన్నప్పుడు సహకరిస్తే అది గొప్పవిషయం. అందరి కోపాన్ని, తాపాన్ని దూరం పెట్టి, అందరూ ప్రేమగా, శ్రద్ధగా, ఓర్పుగా ఉండటం నేర్పించినది హిందూధర్మము.

బలిచక్రవర్తి దానం ఇచ్చే సమయంలో, పుచ్చుకోవడానికి స్వయంగా 'మహావిష్ణువు' వచ్చినట్లుగా రాక్షసగురువు శుక్రాచార్యులు చెప్పి, నీ సర్వస్వం కోల్పోతావు, జాగ్రత్త అని కూడా చెప్తారు. కాని బలిచక్రవర్తి నేను వెతుక్కుంటూ వెళ్ళాల్సిన భగవంతుడే నా దగ్గరకి వచ్చి అడగటం, నేను ఇవ్వటం – దీని కంటే నాకు సార్థకత ఏముంది? అని అనగా, శుక్రాచార్యుడు బలిని కాపాడటానికి తన ప్రయత్నం చేద్దామని దానం ఇచ్చేటప్పుడు నీరు పోసే కమండలం లోపల ఒక క్రిమిలాగా వెళ్ళి ద్వారంలో నీరు రాకుండా అడ్డుగా వున్నారు. నీరు రాకపోయేసరికి ఒక దర్భను తీసి కమండలంలో పొడవగా అది శుక్రచార్యుల కంట్లో గుచ్చుకుని ఒక కన్ను పోయింది. వామనుడు మూడు అడుగుల భూమి కావాలని అడుగుతారు. ఒక అడుగు భూమి, ఒక అడుగు ఆకాశం, మూడో అడుగు ఎక్కడ పెట్టాలంటే బలిచక్రవర్తి తన తలపై పెట్టమని అంటారు. ఇవన్నీ వామనావతారంలో జరిగే అద్భుతాలు. మనం ఈ అవతారాలన్నీ సరిగా అర్థం చేసుకోవాలి. విజయవాడ కృష్ణపుష్కరాలకి వచ్చినప్పుడు త్రివిక్రమస్వామి గుడికి సంబంధించిన మంచి మంచి శిల్పాల ఫొటోలు చూపించారు. అవకాశం వచ్చినప్పుడు వద్దామని అనుకున్నాము. అలాగే ఈ చెరుకూరు కంచిస్వామివారు వచ్చి అనుగ్రహం చేసిన ఊరు. ఈ ఊర్లో మన పీఠభక్తులు చాలామంది ఉన్నారు. చదువుకున్నవారందరూ వేసవికాలంలో వ్యవసాయం లేని సమయంలో వీధినాటకాలు,





తోలుబొమ్మలాట, హరికథలు, భారతరామాయణాలలోని పాత్రలు, మంచిచెడులు గురించి పిల్లలకు తెలియజేయాలి. భీష్మాచార్య, ద్రోణాచార్య, అర్జునుడు, కృష్ణుడు, పాశుపతాస్త్రము, ద్రౌపది, కుంతి గురించి కథలన్నీ చెప్పి ధర్మం ఎలా పాటించాలో అలవాటు చేయాలి. 'అన్నపూర్ణే సదాపూర్ణే శంకర ప్రాణవల్లభే జ్ఞాన వైరాగ్య సిద్ధ్యర్థం భిక్షాం దేహి చ పార్వతి' ఇంటికి వచ్చిన అతిథులకు అన్నదానం అక్షయంగా జరగాలి. రామాయణ మహాభారత కథలన్నీ తెలియడం వల్ల అందరిలో మంచి వివేకం, ధర్మాధర్మ విచక్షణ కలుగుతుంది. మనుషులకు ధైర్యం, అన్యాయం చేయడంలో కాకుండా న్యాయం చేయడంలో ఉండాలి. ఈరోజు మీరందరు అన్ని కులాలు వారు కలుసుకొని 'మనం హిందువులం' అనే సంకల్పంతో దీక్షతో మన ప్రాచీనమైన ఆచారం ప్రకారం అందరూ వారపోయడం, హారతి ఇవ్వడం, పూలూ పళ్ళూ తెచ్చి ఇవ్వడం, బొట్టుపెట్టుకొని సాంప్రదాయంగా రావడం చాలా బావుంది. మన దేశాన్ని కాపాడటం కోసం మనం బలంగా ఉండాలి. బలంగా ఉండే వాళ్ళు మంచిగా మారాలి. అలా ఉన్నప్పుడు లోకంలో శాంతి సుభిక్షం వుంటుంది. మహాలక్ష్మి అమ్మవారి, గంగాపార్వతీ సమేత కోటేశ్వరస్వామివారి, త్రివిక్రమస్వామివారి అనుగ్రహంతో ఈ చెరుకూరు గ్రామంలో చక్కగా పంటలు పండి, అందరికీ కూడా మంచి జరగాలని ప్రార్థిస్తున్నాము. ఇక్కడికి వచ్చేటప్పుడు స్కూల్ కూడా చూశాము. 'ఎక్కడెక్కడ మంచి ఉంటుందో స్వీకరిస్తామని' చక్కని పాట పాడుకున్న విద్యార్థులందరికి మంచి చదువు రావాలని ప్రార్థిస్తున్నాము.

***జయజయ శంకర హరహర శంకర***



# శంకర ఐ హాస్పిటల్ (పెద్ద కాకాని)

**సర్వమంగళ మాంగళ్యే శివే సర్వార్థసాధికే**
**శరణ్యే త్ర్యయంబకే దేవి నారాయణి నమోస్తుతే ॥**

భగవంతుడు అపుడప్పుడు ఒక అవతారం ధరించి ప్రజల్ని, ధర్మాన్ని, కాపాడి ప్రజానీకానికి సుఖాన్ని, శాంతిని, భద్రతను కలిగిస్తుంటారు. అలాగే మత్స్య, కూర్మ, వరాహ, నారసింహ, రామ కృష్ణ అవతారాలన్నీ కూడా వచ్చినాయి. కలియుగంలో కైలాసంలో నివశించే పరమేశ్వరుడు ఆదిశంకరాచార్య స్వరూపంలో కేరళలోని కాలడిలో పుట్టి యావత్భారత దేశంలో పాదయాత్రలు చేశారు. మన పొరుగుదేశం నేపాల్‌లోని కైలాసమానససరోవరానికి పరమేశ్వర దర్శనానికి వెళ్ళి అక్కడి నుండీ అయిదు స్ఫటిక లింగములు తెచ్చి మఠములు స్థాపించారు. అప్పుడే సౌందర్యలహరి అనే అమ్మవారి స్తోత్రాన్ని కూడా తీసుకొనివచ్చారు. కంచిలో యోగలింగం చంద్రమౌళీశ్వరస్వామి అనే పేరుతో ప్రతిష్ఠ చేశారు. ఆ యోగ చంద్రమౌళీశ్వరస్వామిని తరతరాలుగా అదిశంకరాచార్యుల నుంచీ పరంపరలో మహాస్వామి శ్రీచంద్రశేఖరేంద్రసరస్వతీస్వామివారు, శ్రీ జయేంద్ర సరస్వతీస్వామివారు, మేము, శ్రీ సత్య చంద్రశేఖరేంద్ర సరస్వతీస్వామివారు కూడా పూజ చేస్తూ వస్తున్నాము. మన ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగారు గతంలో కృష్ణాపుష్కర సమయంలో వచ్చినపుడు పూజని దర్శనం చేసుకున్నారు. ఇప్పుడు చాతుర్మాస సందర్భంగా తిరుపతికి వచ్చినప్పుడు కూడా శ్రీ చంద్రమౌళీశ్వర స్వామిని, పీఠపూజను దర్శనం చేసుకున్నారు. 68వ పీఠాధిపతిగా నడిచేదేవుడైన మన శ్రీచంద్రశేఖరేంద్రసరస్వతీ స్వామివారు కంచి నుంచి మహారాష్ట్రలోని సతారా వచ్చి, తిరిగి కర్ణాటక చేరి, ఆంధ్రప్రదేశ్‌లోనికి ప్రవేశించే సమయంలో (1983) అప్పట్లో ముఖ్యమంత్రిగా వున్న ఎన్.టి.రామారావుగారు హెలికాప్టర్లో వచ్చి మన మహాస్వామివారిని స్వాగతించారు. కంచిపీఠానికి – ఆంధ్ర దేశానికి మంచి స్నేహసంబంధాలు ఉన్నాయి.

ఆదిశంకరాచార్యులు ఒక ఉపదేశంలో మన ప్రయత్నం విద్యాభ్యాసే సదౌషధే దానే – అని మూడు విషయాలలో కేంద్రీకరించాలని తెలియజేశారు.

1. విద్యాభ్యాసే – 2500 సంవత్సరాల ముందుగానే మంచి చదువు నేర్పించడం అనే సేవను చేయమని ఉపదేశించారు.

2. సదౌషధే – మందులు, వైద్యం కోసం సేవ చేయాలి.

3. దానే – ఆర్థికంగా వెనుకబడి ఉన్నవారికి సహాయసహకారం చేయాలి. పేదరిక నిర్మూలనం

విద్య – చదువు, విత్తం – ఆర్థికంగా బలంగా ఉండడం, బలం – శరీరానికి యోగాభ్యాసము, యశః – కీర్తి, వీటిని అభ్యాసం చేస్తూ శారీరకంగా బలంగా, మానసికంగా ధృఢత్వంతో ఉండాలని



ఆదిశంకరాచార్యులు చెప్పారు. పుణ్యం అందరూ సంపాదించుకోవాలి. అన్నదానం చేయడం, చలివేంద్రం పెట్టడం, చదువు నేర్పించడం లాంటివి మనస్ఫూర్తిగా మంచి సంకల్పంతో చేయాలి. భగవంతుడు అందుకే మనకు అవకాశాన్ని ఇచ్చాడు.

శంకరాచార్యులు చెప్పినట్టుగా కంచిపీఠం తరఫున విద్య, వైద్యం, వేదం అనే 3 విషయాలలో సేవా కార్యక్రమాలు జరుగుతున్నాయి. ధర్మము, వేదము, శాస్త్రము, పురాణాల అభివృద్ధి కోసం అనేక కార్యక్రమాలు దేశంలో కంచిపీఠం ఆధ్వర్యంగా జరుగుతున్నాయి. విశ్వశాంతి కోసం కాశ్మీరు నుండీ ప్రారంభించి అనేక పుణ్యక్షేత్రాలలో హోమాలు క్రతువులు జరుగుతున్నాయి. ఈ దేశం సౌభాగ్యంగా సమైక్యంగా ఉంటూ, అందరిలో మైత్రి సద్భావన పెంపొందాలని కోరుతూ చేసే ప్రార్థన ధర్మపరంగా జరుగుతుంది. మనము వేదమార్గానికి చెందినవారము కనుక మార్గదర్శనం చేయాలి. గైడ్ లైన్స్ ఇస్తూ, గైడెన్స్ చేస్తూ, గార్డియన్‌గా ఉండాలి అంటే వేదాలను అనుసరించాలి.

## వేదము -

వేదపరిరక్షణ చేయాలని 1967, 1968, 1969 సంవత్సరములలో మన ఇద్దరు స్వాములు ఆంధ్రదేశ పర్యటన చేశారు. అప్పుడు మొట్టమొదట తిరుమల తిరుపతి దేవస్థానమువారు స్పందించి 1116/- రూపాయలు స్వామివారికి అందించారు. (అన్నారావుగారు–ఈఓ) గుడి నుంచీ మనము తీసుకోవచ్చా లేదా అని మనస్వామివారు సంశయించి, పీఠం తరఫున కొంత డబ్బును కలిపి 'ధర్మ ప్రచార పరిషత్ ' అనే విభాగాన్ని ఏర్పాటు చేయించారు. గుడి తరఫున ధర్మప్రచారం జరగాలి. దానికి మేమూ సహకరిస్తాము. మీరు చేస్తూనే ఉండండి అనే ఆదేశము సందేశము ఇచ్చారు. అప్పట్లో ప్రారంభించిన ఈ ధర్మ ప్రచార పరిషత్ మన భారతదేశములోనే ప్రధానమైన ఛారిటీగా మనుగడలో ఉన్నది. 1400 మంది వేదపండితులకు ప్రతినెలా సన్మానం చేస్తూ , ఒక మహత్తరమైన ఛారిటీగా అవతరించింది. మహాస్వామివారు వేసిన పునాది ఫలించింది. చాతుర్మాస్యకాలంలో మన ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుగారు వచ్చినప్పుడు ఈ విషయము తెలియజేశాము.

'నారా' అంటే హిందీలో స్లొగన్ అని అర్థము. స్లోగన్లతో పని అవుతుందో కాదో తెలియదు కానీ ఈ నారా (చంద్రబాబు)గారితో పని అవుతుంది అని చెప్పాము. (నారాసే హెూగా యా నహీ హెూగా మగర్ ఏ నారాసే కామ్ హెూ సక్తాహై అని చెప్పాము.) కొన్ని చర్చల అనంతరం వారు వెంటనే తిరుపతి దేవస్థానం అధికారులను పిలిపించి 22000/- రూపాయలు 700మంది ఋగ్వేద, యజుర్వేద, సామవేద, అథర్వణ వేదపండితులకు అలవెన్స్ ఇవ్వాలని వెంటనే ఆదేశం ఇచ్చారు. ఆ ప్రాసెస్ అంతా పూర్తి



అయ్యి, త్వరలోనే ఆంధ్రరాష్ట్రం లోనూ ఇతర రాష్ట్రాలలోను 700మంది వేదపండితులకు సత్కార కార్యక్రమము ఘనంగా జరగబోతున్నదని ఆశిస్తున్నాము. ఇది మన కంచి మహాస్వామివారికి చాలా ఇష్టమైన పని. వేద సంరక్షణం కోసం లోక సంరక్షణం కోసం మన ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగారు ఒక గొప్ప నిర్ణయాన్ని, 18 కోట్ల రూపాయలను ఆమోదించారు. చాలా సంతోషమైన విషయము.

**విద్య -**

మన సంస్కృతి విద్యలో వుండాలని చెప్పి ఎ ఫర్ అర్జున, బి ఫర్ భీష్మ, సి ఫర్ కావేరి ఇలా అక్షరాలను నేర్పిస్తూ ఆధ్యాత్మికతను కూడా శంకరా పాఠశాలల ద్వారా నేర్పిస్తున్నాము. 1993వ సంవత్సరము మహాస్వామివారికి శతాబ్ది ఉత్సవ సంవత్సరం. అప్పట్లో విద్యాశాఖమంత్రిగా వున్న పి.వి నరసింహారావు గారికి సంస్కృతితో కూడిన విద్యను నేర్పించాల్సిందిగా మహాస్వామివారు ఆదేశమిచ్చారు. అలా విద్య, సంస్కృతి, సంగీతం కలిపి నేర్పించే 'శంకరా స్కూల్స్' దేశంలో అక్కడక్కడా జరుగుతున్నాయి. గుంటూరులో కూడా కంచికామాక్షి శంకర విద్యాలయము అనే పాఠశాల ఉన్నది. దాని కోసం భూదానం మాదాల సుధాకర్ ఇచ్చారు. ఇంకా బాలికల కోసం కొత్త రాజధానిలో కూడా శంకరా స్కూల్స్ వస్తాయి. విద్యకోసం కంచిపీఠం తరపున అభివృద్ధి కార్యక్రమాలు జరుగుతున్నాయి.

**వైద్యము -**

వైద్యము కోసము మన జయేంద్రసరస్వతీ స్వామివారు హిందూ మిషన్ హాస్పిటల్స్ అని ప్రారంభించారు. హార్ట్ ఆపరేషన్స్‌తో సహా అనేక వైద్య సదుపాయాలు అందుబాటులో ఉన్నాయి. కోయంబత్తూరులో స్వామివారు పద్మశ్రీ డాక్టర్ రమణి, రాధారమణిగార్లకి సేవా కార్యక్రమములు బాగా చేయాలని ఆదేశించారు. కోయంబత్తూరులోనే వున్న కామాక్షి ఆలయము వద్ద స్థలము స్వామివారే ఏర్పాటు చేయించారు. కంటి ఆస్పత్రి నిర్మాణము అప్పుడే జరిగింది. దేశములోనే ఉన్నత నాణ్యత కలిగిన కంటి ఆస్పత్రిగా పేరు వచ్చింది. లక్షలాదిమందికి కంటి వైద్యము చేయిస్తూ, ఇపుడు ఆంధ్ర ప్రదేశ్లో దాదాపు 7లక్షలమందికి పైగా ఉచితమైన ఉత్తమమైన కంటి వైద్యము అందిస్తున్నారు. దీనికి మన ప్రభుత్వ సహకారము కూడా వుంది. వచ్చే సంవత్సరము 'గోల్డెన్ జూబ్లీ' జరగబోతుంది. మన ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి అనేక రంగములలో ఈ రాష్ట్ర ఉన్నతికోసం ప్రయత్నం చేస్తున్నారు. ఈ ప్రత్యేక కార్యక్రమము కోసమే ఆయన, తిరుపతి నుండి మేము వచ్చాము. ఈ రాష్ట్రములో ఆర్థిక వికాసము, ఆధ్యాత్మిక వికాసము కలగాలని మా ఆకాంక్ష. ప్రతి గ్రామములో కూడా చిన్న మందిరం ఉండేలాగా ప్రయత్నం చేస్తున్నారు. వారి సంకల్పం కూడా మంచిగా నెరవేరాలని కోరుకుంటున్నాము.

భారతదేశంలో ఎ ఫర్ ఆంధ్రప్రదేశ్ అని, ధర్మంలో ఆధ్యాత్మికంలో కూడా ముఖ్యదేశముగా వుండేలాగా అందరు సహాయా సహకారాలు అందించాలి. ఉత్తరోత్తరంగా చంద్రబాబు నాయుడుగారు ఈ ప్రదేశానికి, దేశానికి ఎంతో మంచిసేవలు చేస్తున్నారు. వారు ఇలాగే మంచి పనులు చేయాలని కామాక్షి అమ్మవారిని ప్రార్థిస్తున్నాము. అందరూ కంచికి ఒకసారి వచ్చి అమ్మవారి దర్శనము చేసుకుని, స్వామివారి ఆశీర్వచనం పొందాలని భావిస్తున్నాము.

**హర హర శంకర జయ జయ శంకర**



# శంకర ఐ హాస్పటల్ (పెద్ద కాకాని) కార్యక్రమంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుగారి ఉపన్యాసం

పూజ్యులు కంచి కామకోటి పీఠ జగద్గురువులు శ్రీశ్రీశ్రీ శంకర విజయేంద్ర సరస్వతీ స్వామివారు, డాక్టర్ ఆర్ వి రమణి గారు - శంకర ఐ హాస్పిటల్ వ్యవస్థాపకులు శ్రీ మురళికృష్ణ గారు - శంకర ఐ ఫౌండేషన్, గౌరవనీయులు పార్లమెంట్ సభ్యులు కేంద్ర మంత్రివర్యులు శ్రీ చంద్రశేఖర్ గారు, స్థానిక శాసన సభ్యులు నరేంద్రకుమార్ గారు, ఐఐటీ మద్రాస్ డైరెక్టర్ శ్రీ కామకోటిగారు, మరియు ఈ రోజు ఈ పవిత్ర కార్యక్రమానికి విచ్చేసిన సోదర సోదరీమణులందరికి పెద్ద ఎత్తున అమెరికా నుండి వచ్చిన ఈ ప్రాంతపు దాతలు, ఇక్కడ పవిత్రమైన సేవకు అంకితమైనట్టి సిబ్బందికి అందరికీ కూడా నా నమస్కారాలు.

ధర్మం, న్యాయం, సేవ, మూల సిద్ధాంతాలుగా కంచిపీఠాన్ని జగద్గురువులు శ్రీ ఆది శంకరాచార్యులవారు తమిళనాడులోని కాంచీపురములో స్థాపించారు. నాటి నుంచి నేటి వరకూ హిందూ ధర్మ పరిరక్షణకు కృషి చేస్తూవుంది ఈ సంస్థ. అన్యమతాలనుంచీ హిందూ మతానికి ముప్పు వాటిల్లుతున్న సమయంలో సదాశివుడి రూపమైన ఆది శంకరాచార్య భూలోకంలో జన్మించారని భక్తుల నమ్మకం విశ్వాసం. ఆ విశ్వాసమే ఈ విజయానికి కారణమైనదని నేను మీకు మనవి చేస్తున్నాను.

ఆదిశంకరులు కర్ణాటకలోని శృంగేరి శారదా పీఠం, గుజరాత్ లోని ద్వారకాపీఠం, ఒరిస్సాలోని పూరిలో గోవర్ధనపీఠం, ఉత్తరాఖండ్ బదరీనాథ్‌లో జ్యోతిర్మయ పీఠం - ఇలా దేశంలో నాలుగు దిక్కుల పీఠాలను స్థాపించి స్వయంగా తాము కంచి కామకోటిపీఠంలో ఉండి 4 వేదాలు వ్యాప్తి చెందేలా చేశారు. హిందూ ధర్మాన్ని ఒక బలమైన శక్తిగా మలిచారు. హిందూ ధర్మరక్షణ కోసం తామున్న కంచిపీఠాన్ని మహోన్నతంగా నిలిపారు. ధర్మము, జ్ఞానం, సేవకు పేరుగా కంచిమఠం నిలిచింది. మానవ సేవే మాధవ సేవ అని ఇప్పుడే స్వామివారు చెప్పారు. అలా నమ్మింది కాబట్టే కంచిపీఠం దేశ వ్యాప్తంగా కంటి ఆస్పత్రులను

స్థాపించి పేదలకు ఉచితంగా వైద్యం అందిస్తున్నారు. ఇక్కడుండే శంకర ఐ ఆస్పత్రిని ఈ రోజు సూపర్ స్పెషాలిటీగా చేయడాన్ని స్వామివారి సమక్షంలో నేను ప్రారంభించడం నా అదృష్టంగా భావిస్తున్నాను.

మీరొకసారి చూస్తే సామాన్యులకు సైతం నేత్ర చికిత్సను అందుబాటులో తెచ్చిన శంకర ఐ ఆస్పత్రి 1977లో ఈ సేవా ఉద్యమాన్ని ప్రారంభించారు. ఇప్పుడే డాక్టర్ రమణిగారు తొందరలోనే 50 సంవత్సరాలు నిండుతున్న ఉత్సవాలు జరుపుకోబోతున్నామని చెప్పారు. ఆ ఉత్సవాలకు నేను తప్పకుండా హాజరు అవుతానని విజ్ఞప్తి చేస్తున్నాను. 5 దశాబ్దాలు దేశవ్యాప్తంగా 10 రాష్ట్రాలలో 14 కంటి ఆస్పత్రులను నిర్వహిస్తున్నది ఈ సంస్థ. ఇప్పటి వరకు 30 లక్షల మందికి ఉచితంగా కంటి శస్త్ర చికిత్సలు చేశారు. 70 లక్షల మంది చిన్నారులకు కంటి పరీక్షలు చేయడమనేది ఒక అసాధారణమైన కార్యము. ఈ ఆస్పత్రిలో రోజుకి సగటున 750 మందికి ఉచిత కంటి శస్త్ర చికిత్సలు జరుగుతాయని తెలిసి ఆశ్చర్యపోయాను. అలాంటి ఉదాత్తమైన కార్యక్రమాన్ని చాలా సమర్థవంతంగా నిర్వహిస్తున్న అందర్నీ రాష్ట్ర ప్రభుత్వం తరపున అభినందిస్తున్నాను. 1986లో శంకర ఆస్పత్రి దగ్గర కేవలం 14మంది సిబ్బంది. ఈ రోజు 2268 మంది సిబ్బంది పని చేస్తున్నారు. దేశం మొత్తం 2570 పడకలున్నాయి. భారత దేశంలోనే కాకుండా నేపాల్, కంబోడియా, నైజీరియా వంటి దేశాలలో కూడా ఈ ఆస్పత్రులున్నాయి. ఇలా దేశమంతా వున్నాయి. ఇంకా కొన్ని ప్రాంతాలలో రావాలి. నాకు ఏ మాత్రం సందేహం లేదు. కంచి కామకోటిపీఠం పిలుపునిస్తే మొత్తం దేశమే కాకుండా పక్క ప్రాంతాలలో కూడా సేవలు అందించే దాతలు చాలామందే ఉన్నారు. బ్రహ్మాండమైన సేవలు అందించే దాతృత్వం, శక్తి, ఈ పీఠానికి ఉందని నమ్ముతున్నాను. దేశంలో అనేక పీఠాలున్నాయి. ఎన్నో సేవలు అందిస్తున్నాయి. వాళ్ళందరికీ కూడా ఆదర్శవంతంగా ఈ కంచిపీఠం ఉండడం మన అదృష్టం.

గుంటూరులోని ఐ ఆసుపత్రి 2003 నుంచి మంచిసేవలు అందిస్తోంది. నాలుగులక్షలు పైగా ఉచిత కంటి శస్త్రచికిత్సలు ఇక్కడ జరిగాయి. 9 లక్షల మందికి కంటి పరీక్షలు జరిగాయి. 300 పడకల సామర్థ్యంతో రోజుకు 2500 నుండి 3000 మందికి సేవలు అందిస్తున్నారు. ఈ రోజు మళ్ళీ సూపర్ స్పెషలిటీ ఐ కేర్ బ్లాక్ ను ప్రారంభించారు. దీనివల్ల రాబోయే రోజుల్లో సేవలన్నీ కూడా రెండితలవుతాయి. ఏదో ఉచితంగా చేస్తున్నామని కాకుండా



సమర్థవంతంగా చేస్తున్నారు. 'రైన్బో ప్రోగ్రామ్' ద్వారా ప్రత్యేకంగా పిల్లల కంటి ఆరోగ్యంపై దృష్టి పెట్టడం అభినందనీయం. ఇదే కాకుండా శంకర గ్రామీణ ఐ ప్రాజెక్ట్ అంటే 'గిఫ్ట్ అఫ్ విజన్' – విజన్‌ను దానం చేయమని ఒక మంచి కార్యక్రమం అమలులో వుంది. ఇప్పటివరకు 32000 శిబిరాలు నిర్వహించారు. అనారోగ్యులను ఆస్పత్రికి తీసుకుని రావడం, వైద్య పరీక్షలు చేయడం, అత్యాధునిక చికిత్సలు అందించడం – ఇవన్నీ కూడా ఒక పవిత్రభావంతో అత్యున్నతంగా చేస్తున్నారు. అందరూ స్వామివారి వద్దకు భక్తిభావంతో సేవాభావంతో వస్తారు. కనుక ఈ భావాలే సంస్థను ముందుకు నడిపిస్తున్నాయి. ఇదే ఆస్పత్రి వెలుపల వుంటే అది వ్యాపార ధోరణి అవుతుంది. దేవుని మీద నమ్మకంతో వస్తారు. దానివల్ల వాళ్ళనుకునే లక్ష్యం కూడా శీఘ్రముగా నెరవేరుతుంది. కంచి పీఠాధిపతులు శ్రీ శంకర విజయేంద్ర సరస్వతీ స్వామివారి ఆశీస్సులతో వారి అనుగ్రహ భాషణం విన్నాక, నాకు కూడా 'healthy, wealthy, happy society'గా మన రాష్ట్రం వుండాలని ఆలోచన వచ్చింది. శంకరాచార్యుల వారు 5 గుణాల గురించి చెప్పారు. ఆ ఐదులో



పేదరికం లేని సమాజం చూడాలనేది వారి ఆశయం. అలాంటి పేదరికం లేని సమాజాన్ని మనం నిర్మాణం చేయలేమా అని ఆలోచిస్తే అది అసాధ్యం కాదు. మనందరం కృషి చేస్తే తప్పకుండా సాధిస్తామని మనవి చేస్తున్నాను. ప్రతి వారికి ఆరోగ్యం ప్రధానం. అందుకే మా ప్రభుత్వం వినూత్నంగా అలోచించి 'ఖఅఉజవతీయిశ్రీ ష్ట్రముశ్రీష్ట్ర ఎశీజవతీఖుస్త్రవ' తీసుకొచ్చాము.

ఈ రాష్ట్రంలో వుండే ప్రజలందరికీ 2,50,000/- రూపాయల ఆరోగ్యభీమాను కల్పించే బాధ్యతను మా ప్రభుత్వం తీసుకుంది. అంతే కాకుండా పేదవాళ్లందరికీ 25 లక్షల వరకు విలువైన వైద్యసేవలు అందించడానికి సంజీవని అనే ఇంకో ప్రణాళికను తీసుకొస్తున్నాము. ఎలాగైతే శంకర ఐ ఆస్పత్రివారు కృత్రిమ మేధను (artificial intelligence) ఉపయోగించి మెరుగైన సేవలు రోగులకు అందిస్తున్నారో అలా ప్రపంచంలో ఆరోగ్యానికి చెందిన ఏ విషయమైనా రోగి ఇంటివద్దకే చికిత్సను అందించే విధంగా సంజీవిని ప్రాజెక్ట్ పనిచేయబోతుంది. ఈ రాష్ట్రంలోని 5 కోట్ల ప్రజల యొక్క 'హెల్త్ రికార్డ్స్' అన్నీ డిజిటలైజ్ చేసి ఆస్పత్రి గానీ ప్రైవేటుగా వైద్యం అందించేవారు గానీ అందుబాటులో వుండేలా చూడాలి. ఎందుకంటే ఆరోగ్యాన్ని మించినది ఏదీ లేదు. అనారోగ్యమే నిజమైన పేదరికము. ఈ శంకర ఐ ఆస్పత్రివారు చేస్తున్న సేవలని మనస్ఫూర్తిగా అభినందిస్తున్నాను. వారు చేసే కార్యక్రమములో తప్పకుండా ప్రభుత్వం ముందుటుందని హామీ ఇస్తున్నాను. అన్ని విధాలా సహకరిస్తామని స్వామివారికి ప్రభుత్వం తరపున నేను హామీ ఇస్తున్నాను. సేవనే పరమావధిగా భావించే శ్రీ శ్రీ శ్రీ శంకర విజయేంద్ర సరస్వతీ స్వామివారి మార్గదర్శనములో వుంటూ ఎప్పటికప్పుడు విషయసేకరణ చేసుకుంటూ వారి ఆశీస్సులతో ముందుకు సాగుతాము. అప్పట్లో మహాస్వామివారికి టి.టి.డి.దేవస్థానమువారు కొంత డబ్బు ఇస్తే ఆ డబ్బుకు సమానంగా వారూ ఇచ్చి 'ధర్మ ప్రచార పరిషత్' కోసం ఉపయోగించమని చెప్పారు. ఆ రోజే ఆ పరిషత్తు ప్రారంభమైంది. ఈ విషయాన్ని స్వామివారు ఇప్పుడే తమ మాటల్లో చెప్పారు. ఆ చిన్న విషయమే ఈ రోజు మన దేశంలోనే ప్రధానమైన ధర్మ ప్రచార పరిషత్‌లా రూపుదిద్దుకుంది. దేశంలోని ప్రతి ప్రధాన నగరంలో వేంకటేశ్వరస్వామి వారి దేవాలయం వుండాలని సంకల్పించాము. ప్రపంచంలో హిందువులున్న ప్రతిచోటా వెంకటేశ్వర స్వామి దేవాలయం ఉండాలి. స్వామివారి 5000 దేవాలయాలని గ్రామీణ ప్రాంతాలలో నిర్మించాలని సంకల్పించాము. శ్రీ విజయేంద్ర సరస్వతీ స్వామివారి ఆదేశాల ప్రకారము 700 మంది వేదపండితులకు ప్రత్యేక శిక్షణ ఇచ్చి వారందరికీ గౌరవవేతనం ఇచ్చే ఏర్పాటు చేస్తున్నాము. ఈనాడు మన కుటుంబ వ్యవస్థ సక్రమంగా వుందంటే కంచి పీఠము, మిగిలిన అన్ని పీఠాలు చాలా కృషి చేశాయి. ప్రపంచంలోనే కుటుంబ విలువలు, కుటుంబ వ్యవస్థ వున్న ఏకైక దేశం మన భారత దేశం. ఆదిశంకరాచార్యులు ప్రబోధించిన విలువల వల్లనే మన కుటుంబ వ్యవస్థ పటిష్టంగా వుంది.

మనకు మానసికానందంతో పాటు చికిత్సను అందించే ఇలాంటి ఆధ్యాత్మిక సంస్థలు చాలా అవసరం. ఇవే లేకపోతే మనకు మెంటల్ ఆస్పత్రులు ఎక్కువగా ఉండేవి. దేశానికే ప్రధానమైన IIT చెన్నై డైరెక్టర్ శ్రీకామకోటి గారు ఇక్కడ అన్నీ మరిచి సామాన్య భక్తుడిలా నమ్మకంతో వున్నారు. నమ్మకమే ప్రధానం. స్వామివారి ఆశీర్వాదంతో ఈ శంకర ఐ హాస్పిటల్‌కు నా పూర్తి సహకారం ఉంటుందని నేను మనివి చేసుకుంటున్నాను.

# అయోధ్య ధ్వజారోహణం సందర్భంగా స్వామివారి సందేశం



మన దేశంలో రామరాజ్యం రావాల్సిన అవసరం వుంది. సామాజికపరంగా మనం భారతీయులము. మనం హిందూదేశ నాగరికులము కావున మనందరం గర్వపడాలి, గౌరవింపబడాలి. న్యాయస్థానాల ద్వారా దేవస్థాన నిర్మాణం జరిగింది. అయోధ్యలో మన సుప్రీమ్ కోర్ట్ ఆదేశాల ప్రకారము భవ్యమైన మందిర నిర్మాణం జరిగింది. మందిర నిర్మాణం సంపూర్ణం అయిన సందర్భంలో ధ్వజారోహణం జరిగింది. కోవిదారవృక్షము, సూర్య, ప్రణవ మంత్రము కలిగిన ధ్వజాన్ని వివాహపంచమి రోజు మంగళవారము నాడు ప్రధాని మోడీగారు, మోహన్ భగవత్‌గారు ముఖ్య అతిథులుగా ఆవిష్కరించడం జరిగింది.

అందరు సుభిక్షంగా ఉండాలి, పేదరిక నిర్మూలన జరగాలి. అందరికీ సంపాదన వుండాలి. అందరూ ధార్మిక జీవితాన్ని గడపడానికి మంచి వాతావరణం వుండాలి. శాంతితో ఐక్యంగా ఉండాలనే భావన వుండాలి. దేశము సమగ్రముగా వుండాలి. వ్యవసాయం అభివృద్ధి చెందాలి. జ్ఞానం పెంపొందాలి. ప్రతి గ్రామంలోని చిన్నచిన్న మందిరాలకు కూడా పోషణ ఉండాలి. దేశ ప్రజలందరికీ ఆహారలోటు ఉండకూడదు. ఇందుకోసం మంచి పరిపాలన అవసరం - ఇదే రామరాజ్యం!

వరుసగా మూడోసారి వచ్చిన ప్రస్తుత ప్రభుత్వం మంచి కార్యక్రమాలు చేస్తున్నారు. నేల నుండీ అంతరిక్షం వరకూ , చంద్రయాన్, మంగళ్యాన్ వరకూ - కార్యక్రమాలు జరుగుతున్నాయి. అయోధ్యలో కూడా 'ధర్మ ప్రచార పరిషత్' ఏర్పాటు చేసారు. ఇక్కడి నుండీ 200 కిమీ దూరంలో వున్న మందిరాలలో ధార్మిక వాతావరణాన్ని కల్పించడానికి రామచరితమానస్, మీరాభజనలు, హిందుస్తానీ శాస్త్రీయ సంగీతం - ఇలాంటి భారతీయ కళలను, విజ్ఞానాన్ని ప్రచారం చేయాలి. దేశం కోసం మన వ్యక్తిగత అహంకారము విడనాడాలి. అంతా మేమే, మాకే తెలుసు అనే భావన మంచిది కాదు. సామాజికంగా మనం భారతీయులం. ఆ భావనతో అన్ని విశ్వాసాలను, సంప్రదాయాలను, వివిధ ధార్మిక వ్యక్తులను మైత్రితో కలుపుకుంటూ ముందుకు సాగాలి. మైత్రి, ఐక్యత ద్వారానే ఈ దేశానికి ఒక విశిష్టస్థానం వస్తుంది. మన దేశం శాంతి సౌభాగ్యంతో ఉండి,



గట్టి నిర్ణయం చేసుకుంటే పెట్టుబడులు వస్తాయి. దేశంలో ఎన్ని భాషలు వున్నా, ఎన్ని విశ్వాసాలున్నా అందరూ – ధర్మానికి, సమాజానికి, విశ్వాసానికి – ప్రగతి మార్గాన్ని అనుసరిస్తూ దేశాన్ని విశ్వగురు స్థానంలో ఆదర్శంగా నిలపాలి. స్వశక్త భారతదేశం కావాలంటే ముందుగా మహిళల ఆరోగ్యం, విద్యలకు ప్రాధాన్యం ఇవ్వాలి. విశ్వంలోనే పెద్ద ప్రజాస్వామ్యమైన మన దేశం, భిన్నత్వంలో ఏకత్వంగా ఉండడానికి అందరూ సహకరించాలి. 'అమృత బిందు ఆనంద సింధు' అన్నట్లుగా చిన్ని చిన్ని సహకారమైనా ఆనందమే. ఈ బిందువులన్నీ కలిస్తే సముద్రమైపోతుంది. ఆ సంకల్పంతోనే అయోధ్యలో 25న ధ్వజారోహణ కార్యక్రమం జరుగుతున్నది. ఈ ధర్మ ధ్వజాన్ని ఉన్నతంగా నిలబెట్టి ధర్మఛత్ర ఛాయలో భౌతిక, ఆధ్యాత్మిక భారత ప్రగతి కోసం విశ్వ సౌభాగ్యానికి కోసం తోడ్పడాలి.

మన దృక్పథం ఎప్పుడూ సకారాత్మకంగానే (positive) ఉంటుంది. మనకు ఎవరిపై ద్వేష భావం కానీ, అహంకారం కానీ లేవు. అందరితో స్నేహంగానే ప్రేమతోనే ఉంటాము. సనాతన ధర్మముతో భారతదేశ ప్రగతి వుండాలని రాములవారిని ప్రార్థిస్తున్నాము.

**జయ జయ శంకర హర హర శంకర**

# జగద్గురు యాత్రా విశేషాలు



**తేదీ: నవంబర్ 5, 2025** తిరుపతిలోని శ్రీమఠం శిబిరంలో పూజ్యశ్రీ శంకర విజయేంద్ర సరస్వతీ శంకరాచార్య స్వామివారి సన్నిధిలో పౌర్ణమి – చండీ హోమం నిర్వహించబడింది. పూజ్యశ్రీ స్వామివారికి శ్రీ బంగారు కామాక్షి ఆలయం మరియు శ్రీ కంచి కామాక్షి అన్నవారు దేవస్థానం నుండి ప్రసాదాలు అందించబడ్డాయి.





**తేదీ: నవంబర్ 7, 2025** శ్రీ కంచి కామకోటి పీఠాధిపతులు పూజ్యశ్రీ శంకర విజయేంద్ర సరస్వతీ శంకరాచార్య స్వామివారు ఉదయం 7:30 గంటలకు ఒంగోలు నుండి బయలుదేరి బాపట్ల వరకు విశేషమైన ఆలయాలను సందర్శించారు. మార్గమధ్యంలో తోటవారిపాలెంలో జగద్గురువులను భక్తులు ఘనంగా ఆహ్వానించారు. గ్రామంలో నిర్మాణంలో ఉన్న రామాలయం, శంకర్‌మఠం నిర్మాణాలను స్వామివారు పరిశీలించారు. స్వామివారి దర్శనంతో భక్తులు తమ ఆనందాన్ని వ్యక్తం చేశారు. గజపృష్ఠ విమానశైలిలో రాతితో ఆలయాన్ని నిర్మిస్తున్నారు. పూజ్య స్వామివారు గ్రామస్తుల చేస్తున్న ప్రయత్నాలను ఆశీర్వదించి బాపట్ల యాత్రను ప్రారంభించారు

## బాపట్లలో రామలింగేస్వరస్వామి ఆలయ కుంభాభిషేకం















**తేదీ: నవంబర్ 7, 2025**

పూజ్యశ్రీ స్వామివారు ఉదయం 9:30 గంటలకు బాపట్ల చేరుకున్నారు. స్వామివారిని ఆహ్వానించడానికి భక్తులు నాదస్వర బృందంతో, మహిళలు కోలాటం ఆడుతూ, కాషయ వస్త్రాలు ధరించి ఘనంగా స్వాగతించారు. శోభాయాత్ర నెమ్మదిగా శ్రీ రామలింగేశ్వర స్వామి ఆలయం వైపు కదిలింది. స్వామివారు ముందుగా యాగశాల చేరుకొని పూర్ణాహుతి కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం పర్వతవర్ధిని సమేత రామలింగేశ్వర స్వామి ఆలయానికి చేరుకుని మహాకుంభాభిషేక కార్యక్రమం నిర్వహించారు. ఆ తరువాత ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన పందిళ్ళలో భక్తులను ఉద్దేశించి అనుగ్రహ భాషణం చేశారు.

# బాపట్లలోని క్షీరా భావనారాయణస్వామి ఆలయ సందర్శన












**తేదీ: నవంబర్ 7, 2025** శ్రీ స్వామివారు బాపట్లలోని సుందరవల్లి రాజ్యలక్ష్మీ సమేత క్షీర భావనరాయణ స్వామిని సందర్శించారు. సాయంత్రం 6 గంటల ప్రాంతంలో స్వామివారు శిబిరం నుండి ప్రధాన రహదారి మీదుగా ఆలయానికి నడిచి చేరుకున్నారు. ఆలయ అర్చకులు మరియు ప్రధాన అధికారులు ప్రవేశ ద్వారం వద్ద పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. స్వామివారు విశేష పూజలు నిర్వహించి, భక్తుల నుద్దేశించి అనుగ్రహ భాషణం చేశారు.



# చెరుకూరులోని గంగాపార్వతీ సమేత కోటేశ్వరస్వామి ఆలయ సందర్శన










**తేదీ: నవంబర్ 8, 2025** శ్రీ శంకర విజయేంద్ర సరస్వతీ స్వామివారు 8వ తేదీ ఉదయం బాపట్ల దగ్గరి చెరుకూరులోని గంగాపార్వతీ సమేత కోటేశ్వరస్వామి ఆలయానికి ఊరి పొలిమేరల నుండి కాలినడకన చేరుకున్నారు. మార్గమధ్యంలో భక్తుల నుండి మంగళహారతులు, పూలమాలలను స్వీకరిస్తూ, వారిని ఆశీర్వదిస్తూ, ఆలయానికి విచ్చేశారు. ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో, వేదమంత్రాలతో స్వామివారికి స్వాగతం పలికారు. ఆలయంలో స్వామివారు విశేష పూజలు నిర్వహించారు. చెరుకూరులోనే గల త్రివిక్రమస్వామి మరియు మహాలక్ష్మీ ఆలయాలను కూడా స్వామివారు సందర్శించి, భక్తులను ఉద్దేశించి అనుగ్రహ భాషణం చేశారు. చెరుకూరుకోని పాఠశాలను కూడా సందర్శించి విద్యార్థులను ఆశీర్వదించారు.

# కోటి దీపోత్సవంలో శ్రీ స్వామివారు






**తేదీ: నవంబర్ 13, 2025** శ్రీ శంకర విజయేంద్ర సరస్వతీ స్వామివారు హైదరాబాద్‌లోని ఎన్.టి.ఆర్ స్టేడియంలో జరిగే కోటిదీపోత్సవ కార్యక్రమానికి 13వ తేదీ విచ్చేసి విశేషంగా వచ్చిన భక్తులను ఆశీర్వదించారు. సమిష్టిగా, సామూహికంగా ఆధాత్మిక, ధార్మిక కార్యక్రమాలు నిర్వహించడం ఎంతో ఆవశ్యకమని తెలియజేశారు. ఇంతటి విశేష కార్యక్రమాన్ని ప్రతి ఏటా నిర్వహిస్తున్న నిర్వాహకులను ఆశీర్వదించారు.


# తిరుమల శ్రీవారి సేవలో కంచి ఆచార్యులు









తేదీ: నవంబర్ 12, 2025 శ్రీ శంకర విజయేంద్ర సరస్వతీ స్వామివారు మరియు శ్రీ సత్య చంద్రశేఖరేంద్ర సరస్వతీ స్వామివారు తిరుమల శ్రీవారి దర్శనం చేసుకున్నారు. తిరుమలలో ఆలయ అర్చకులు, టీటీడీ చైర్మన్, ఈఓ మరియు ఇతర అధికారులు ఆచార్యులకు స్వాగతం పలికారు. మంత్రోచ్చారణ మరియు మంగళవాద్యాలతో స్వామివార్లను ఊరేగింపుగా తీసుకువెళ్ళారు. ఊరేగింపులో మధ్యలో ఆచార్యులు బేడి ఆంజనేయస్వామి దర్శనం చేసుకున్నారు. శ్రీవారి దర్శనం తరువాత ఆచార్యులు తిరుమల మాడవీధులలో ప్రధాన సన్నిధి చుట్టూ ప్రదక్షిణ చేసి ఆలయ గౌరవ మర్యాదలతో ఊరేగింపుగా శంకరమఠం చేరుకున్నారు.





# ముంబయిలోని ఆంజనేయస్వామి ఆలయ కుంభాభిషేకము









తేదీ: నవంబర్ 26, 2025 శ్రీ కంచి కామకోటి పీఠాధిపతులు జగద్గురువులు పూజ్యశ్రీ శంకర విజయేంద్ర సరస్వతీ స్వామివారు వివిధ కార్యక్రమాలలో పాల్గొనటానికి ఈ రోజు మధ్యాహ్నం ముంబై చేరుకున్నారు. 27వ తేదీ ఉదయం ముందుగా నెరూల్‌లోని ఎస్ఐఈఎస్‌లోని శ్రీ ఆంజనేయ స్వామి ఆలయంలో కుంభాభిషేకం నిర్వహించారు. ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో, వేద మంత్రోచ్చారణలతో స్వామివారికి స్వాగతం పలికారు.

# ముంబైలోని సిద్ధివినాయక ఆలయ సందర్శన







**తేదీ: నవంబర్ 28, 2025** శ్రీ శంకర విజయేంద్ర సరస్వతీ స్వామివారు ముంబైలోని సిద్ధివినాయక ఆలయాన్ని సందర్శించుకున్నారు.

# శ్రీమహాలక్ష్మీ అమ్మవారి సందర్శనం








**తేదీ: నవంబర్ 28, 2025** శ్రీ శంకర విజయేంద్ర సరస్వతీ స్వామివారు ఈ నాటి ఉదయం ముంబైలోని శ్రీమహాలక్ష్మీ మందిరాన్ని సందర్శించుకుని విశేష పూజలు నిర్వహించారు.







**తేదీ: నవంబర్ 28, 2025** శ్రీ శంకర విజయేంద్ర సరస్వతీ స్వామివారు ముంబైలోని మాతుంగలో ఉన్న ఆస్తిక సమాజాన్ని సందర్శించారు. అక్కడి అర్చకులు స్వామివారికి పూర్ణకుంభతో స్వాగతం పలికారు. అక్కడ నుండి స్వామివారు మాతుంగలోనే ఉన్న శంకరమఠానికి చేరుకుని భక్తులను ఆశీర్వదించి అనుగ్రహభాషణం చేశారు.

# చెంబూరులోని అహోబిలమఠాన్ని సందర్శించిన స్వామివారు










**తేదీ: నవంబర్ 29, 2025** శ్రీ శంకర విజయేంద్ర సరస్వతీ స్వామివారు ఈ రోజు ఉదయం ముంబైలో చెంబూరులోని అహోబిలమఠం సందర్శించి, నరసింహస్వామి, అమ్మవారి, ధన్వంతరిస్వామి సన్నిధిలో విశేష పూజలు నిర్వహించారు. భక్తులను ఆశీర్వదించి అనుగ్రహభాషణం చేశారు.

# గురువందన సమారోహ్






**తేదీ: నవంబర్ 29, 2025** శ్రీ శంకర విజయేంద్ర సరస్వతీ స్వామివారు ముంబైలో శ్రీ షణ్ముఖానంద ఫైన్ ఆర్ట్స్, సంగీత సభ ఆధ్వర్యంలో జరిగిన 'గురువందన సమారోహ్' కార్యక్రమంలో పాల్గొని అనుగ్రహభాషణం చేశారు.



**తేదీ: నవంబర్ 29, 2025**

**శ్రీ శంకర విజయేంద్ర సరస్వతీ స్వామివారు చెంబూరులోని శ్రీ సుబ్రహ్మణ్య సమాజాన్ని సందర్శించారు. అనుగ్రహ భాషణంతో భక్తులను ఆశీర్వదించారు. శ్రీ సుబ్రహ్మణ్య స్వామికి వజ్రాలు పొదిగిన 'వేల్' ఆయుధాన్ని సమర్పించారు.**



# కుంభకోణంలోని శ్రీ ఆది కుంభేశ్వర ఆలయ కుంభాభిషేకం





**తేదీ: డిసెంబర్ 1, 2025** శ్రీ కంచి కామకోటి పీఠాధిపతులు శ్రీ శంకర విజయేంద్ర సరస్వతీ స్వామివారు తమిళనాడులోని కుంభకోణంలో శ్రీ ఆది కుంభేశ్వర ఆలయ మహాకుంభాభిషేకం ఘనంగా నిర్వహించి భక్తులను ఆశీర్వదించి అనుగ్రహ భాషణం చేశారు.





# నందివిద్యా నటేశ్వరి

## (నృత్య, మృదంగ ప్రదర్శన కార్యక్రమం)




**తేదీ: డిసెంబర్ 4, 2025** శ్రీ శంకర విజయేంద్ర సరస్వతీ స్వామివారి సన్నిధిలో తిరుపతిలోని మహతీ ఆడిటోరియంలో నందివిద్యా నటేశ్వరీ అనే భరతనాట్య మరియు మృదంగ వాద్య కార్యక్రమం ఎంతో హృద్యంగా జరిగింది. సంప్రదాయ పాఠశాల విద్యార్థినిలు, ఇంటిగ్రేటెడ్ పాఠశాల, వేదపాఠశాల విద్యార్థులు ఈ కార్యక్రమంలో పాల్గొని, మృదంగ విద్వాంసులుచే చెప్పబడిన జతులను పలుకుతూ చప్పట్లతో ఆద్యంతం కార్యక్రమంలో ఉల్లాసంగా పాల్గొన్నారు. శ్రీస్వామివారు ఆద్యంతం కార్యక్రమం తిలకించి కళాకారులను అభినందించారు.

# కంచిలో ఏకామ్రనాథస్వామికి స్వర్ణరథ సమర్పణం






**తేదీ: డిసెంబర్ 6, 2025** శ్రీ శంకర విజయేంద్ర సరస్వతీ స్వామివారి చేతులమీదుగా కాంచీపురంలో శ్రీ ఏకామ్రనాథస్వామివారికి స్వర్ణరథ సమర్పణం ఘనంగా జరిగింది. ఓరిక్కై నుండి కాంచీపురం వరకు స్వర్ణరథం యొక్క ఊరేగింపు ఎంతో వేడుకగా కనులపండువగా జరిగింది.







**తేదీ: డిసెంబర్ 6, 2025** కాంచీపురంలోని శ్రీ మహాస్వామివారి మణిమండపంలో శ్రీ శంకర విజయేంద్ర సరస్వతీ స్వామివారి ఆధ్వర్యంలో వేద అధ్యాపక సమ్మేళన కార్యక్రమం జరిగింది. అధ్యాపకులకు సత్కారం జరిగింది.

# కాంచీపుర ఏకామ్రనాథస్వామి ఆలయ మహాకుంభాభిషేకం













**తేదీ: డిసెంబర్ 7, 2025** కాంచీపురంలోని శ్రీ ఏకామ్రనాథస్వామి ఆలయ కుంభాభిషేకం శ్రీ కంచి కామకోటి పీఠాధిపతులు శ్రీ శంకర విజయేంద్ర సరస్వతీ స్వామివారు మరియు శ్రీ సత్య చంద్రశేఖరేంద్ర సరస్వతీ స్వామివార్ల ఆధ్వర్యంలో ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా విశేష పూజలు, హోమాలు, యాగాలు, ప్రసాద వితరణ అత్యంత శుభప్రదంగా జరిగాయి.

# అత్యంత భక్తి శ్రద్ధలతో శ్రీ మహాస్వామివారి ఆరాధనా మహోత్సవం











**తేదీ: డిసెంబర్ 16, 2025** కాంచీపురంలోని మణిమండపంలో శ్రీశ్రీశ్రీ మహాస్వామివారి 32వ ఆరాధనా మహోత్సవం శ్రీ శంకర విజయేంద్ర సరస్వతీ స్వామివారు, శ్రీ సత్య చంద్రశేఖరేంద్ర సరస్వతీ స్వామివారు వేద మంత్రోచ్చారణ, విశేషపూజల నడుమ ఎంతో భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. వేదపండిత సదస్సు జరిగింది. విశేషంగా భక్తులు ఈ కార్యక్రమంలో పాల్గొని, గురువందనం సమర్పించుకున్నారు.

# మూకపంచశతి-ఆర్యాశతకం



- బాలాత్రిపురసుందరి చిర్రావూరి



శ్లో॥ సమయా సాంధ్యమయూఖైః సమయా బుద్ధ్యా సదైవ శీలితయా ।
ఉమయా కాంచీరతయా న మయా లభ్యేత కిం తు తాదాత్మ్యమ్ ॥ 44 ॥

**తాత్పర్యం :** సంధ్యాసమయకిరణముతో సమానకాంతిగల సమయాదేవి అను బుద్ధితో ధ్యానింపబడిన కాంచీనగరము నందు అధిష్ఠించిన కామాక్షీదేవితో తాదాత్మ్యము కలుగకుండా ఉంటుందా? కలుగుతుంది అని అర్థము.

**బాలమనోజ్ఞా :** సంధ్యాకిరణకాంతివలె అమ్మవారి తేజస్సు ఎఱ్ఱనిది. అటువంటి సంధ్యాకిరణాలతో సమానమైన తేజస్సుగల సమయాదేవి అను బుద్ధితో ధ్యానింపబడినప్పుడు తాదాత్మ్యము ఎందుకు కలుగదు? శ్రీశంకరులు సౌందర్యలహరిలో 'తవాధారే మూలే సహ సమయయా లాస్యపరయా..' అన్నారు. మూలాధార

చక్రంలో లాస్యరూపనృత్యాన్ని అనుష్ఠిస్తున్న సమయా దేవితో కూడి నవరసతాండవనృత్యాన్ని చేస్తున్న శివుని ధ్యానిస్తున్నాను. అంటారు. మూలాధారంలో వీరిరువురికి అభేదము. వారిని ధ్యానిస్తున్న భక్తునికి – ఆ తల్లికి కూడా భేదము లేదు. ధ్యేయవస్తువు ధ్యాత ఒక్కటే ఔతున్నారు.

సమయాచారబుద్ధితో ఆ తల్లిని ధ్యానించే వాడు సారూప్యాన్నే పొందుతున్నాడని కూడా చెప్పుకోవచ్చు. ధ్యాత– ధ్యానము– ధ్యేయము ఈ మూడు వేరువేరుగా ఉంటాయి ప్రారంభదశలో. కానీ తదేక ధ్యానము చేయగా చేయగా ధ్యాతయే ధ్యేయముగా ఔతాడు. ఇదే అద్వైతము.

సతీదేవి హిమవత్పుత్రికగా జన్మించి శివుని గూర్చి తపస్సునకు పోవునప్పుడు తల్లి మేనాదేవి 'ఉమా' అన్నదట. 'ఉ' అంటే అమ్మాయి! 'మ' అంటే పోవలదు. అని. ఆ ఉమయే ఈ కామాక్షి. ఈ తల్లి మృల్లింగాన్ని చేసి శివుని గూర్చి తపస్సు చేసింది కదా. అందుకే ఆమె కూడా 'శివా ' ఐనది. మరి శివుని గూర్చి తపస్సు చేసిన ఆ తల్లి శివునితో అభేదాన్ని పొందినది కదా! నేను కూడా ఆమెతో అభేదాన్ని ఎందుకు పొందను? ఖచ్చితంగా పొందుతానని భావము.

**శ్లో॥ జంతోస్తవపాదపూజన సంతోషతరంగితస్య కామాక్షి ।**
**బంధోయది భవతి పునః సింధోరంభస్సు బంభ్రమీతి శిలా ॥ 45 ॥**

**తాత్పర్యం :** ఓ కామాక్షి దేవి! నీ పాదములను పూజించుట యందలి సంతోషముతో ఓలలాడువానికి బంధములున్నట్లైతే సముద్రపునీటి మధ్యలో రాయి తిరిగినట్లే ఉండును.

**బాలమనోజ్ఞా :** అమ్మవారి పాదములను పూజించుట యందే ఎప్పుడూ ఆసక్తి కలవానికి సంసారము బంధము కాదు. అమ్మవారిని పూజించుట అనే సంతోషసముద్రంలో అతడు ఓలలాడుతూ ఉంటాడు. బంధించి ఉన్నవానిని నీటిలో పడవేస్తే కొట్టుకుంటూ దారి తెన్నూ లేక ఎక్కడికి పోతాడో తెలియదు. కానీ ఆ తల్లి పాదపద్మాలను నమ్మినవానికి సంసార సాగరం లో ఉన్నా దానిలో మునిగిపోకుండా రాతి వలె తేలుతూ ఉంటాడు. . అమ్మవారిని పూజించే సంతోషమే సముద్రము. రాయి ఆ తల్లి యొక్క కృప.



## శ్రీ మహా త్రిపురసుందర్యై నమః
## శ్రీ గురు కామాక్షియై నమః
## శ్రీ కామాక్షి విలాసః

ప్రథమోధ్యాయః సురథ మార్కండేయ సంవాదః

**సురథ ఉవాచ :**

మునీశ కరుణాసిన్ధో వేద వేదాన్తవిత్తమ
త్వయా ప్రోక్తం మహాపుణ్యం చండికాఖ్యానముత్తమమ్
ఇదానీం శ్రోతుమిచ్ఛామి పీఠత్రయ రహస్యకమ్
వద మే తన్మహాతేజహా కృపయా కరుణానిధే

సురథుడను మహారాజు మార్కండేయ మహర్షికి సాష్టాంగ నమస్కారము లాచరించి, వినయముతో ఈ విధముగా అనెను.

'ఓ వేదవేదాంతవితమా! మహా తేజస్వీ! కరుణాసముద్రా! మహర్షి సార్వభౌమా! మార్కండేయా! ఇంతకు పూర్వము మహాపుణ్యప్రదమైన 'చండికా చరిత్రమును' దయతో తెలిపియున్నావు. ఇప్పుడు 'పీఠత్రయ రహస్యము'ను వినవలెననెడి కోరిక అధికముగా కలదు. కనుక దాని విషయవిశేషములను సవివరముగా తెలియపరచి నన్ను కృతార్థుని గావించ ప్రార్థన' అని పలికెను.

**మార్కండేయ ఉవాచ :**

**శృణు వక్ష్యే నృపశ్రేష్ఠ యన్మామ్ త్వం పరిపృచ్ఛసి**
**తస్య శ్రవనమాత్రేణ సర్వ పాపైః ప్రముచ్యతే**

అప్పుడు మార్కండేయ మహర్షి 'ఓ సురథ మహారాజా! నీవు అడిగిన 'పీఠత్రయరహస్యము'ను సవివరముగా చెప్పెదను సావధానమనస్కుడవై వినుము'

**పంచాశత్ కోటి విస్తీర్ణే వర్తన్తే పృథివీతలే**
**కామకోటి మహాపీఠాన్యుత్తమాని హి తేష్వపి**
**చతుష్షష్టి సహస్రాణి తేషు చేష్టాష్టకాని హి**
**మాతృకా సంఖ్యయా తేషు తేషు తత్వాను సంఖ్యయా**
**తేషు చష్టాదశ శ్రేష్ఠ్యాన్యేషు పీఠత్రయం వరమ్**

ఏబదికోట్ల ఆమడల విస్తీర్ణము గల భూమండలము నందంతటను కామకోటి పీఠములు గలవు. వానిలో అరువదినాలుగువేల పీఠములు ఉత్తమములు. మరల వానిలో ఏబది ఉత్తమములు. మరల వానిలో ఇరువది నాలుగు ప్రశస్తములు. వానిలో మరల పదునెనిమిది శ్రేష్ఠములు. మరల వానిలో మూడు పీఠములు ఉత్తమోత్తమములైనవి.

**కామరాజాది పీఠత్రయ వివరణమ్**

**తత్రయే కామరాజాఖ్యాం ప్రథమం హి ప్రశస్యతే**
**తత్పీఠే వాగ్భవం కూటం హయగ్రీవేణ పూజితమ్**
**జాలన్ధ్రాఖ్యం ద్వితీయం తు మధ్యకూటం మనోభవం**
**భృగుణా భ్యర్చితం పీఠం జ్వాలాముఖ్యం తు తద్విదుః**
**ఓడ్యాణాఖ్యం తృతీయం తు పరాబీజ స్వరూపకమ్**
**తత్పీఠం కామరూపే స్తి వ్యాసేనోపాసితం సదా**
**ఏవ పీఠత్రయం శ్రేష్ఠం సర్వపీఠ ఉత్తమోత్తమమ్**

**కామరాజాది మూడు పీఠముల వివరణము :**

ఆ మూడు పీఠములలోను మొదటిది కామరాజ పీఠము - ఇది వాగ్భవభీజ (ఐం) రూపమగు 'వాగ్భవకూటము'. ఈ కూటము హయగ్రీవునిచే అర్చింపబడినది. ఇది కాంచీపురము నందు కలదు. రెండవది 'జాలంధర పీఠము'. ఇది మన్మథ బీజ (క్లిమ్) రూపమగు 'మధ్యకూటము'. ఈ కూటము భృగు మహర్షిచే పూజింపబడినది. ఇది జ్వాలాముఖీ క్షేత్రమునందు కలదు. మూడవది 'ఓడ్యాణ పీఠము'. ఇది శక్తిబీజ (సౌహ్) రూపమగు 'శక్తికూటము'. ఈ కూటము వ్యాసమహర్షిచే ఉపాసించబడుచున్నది. ఇది కామరూపదేశమున కలదు. ఈ మూడు పీఠములు అన్ని పీఠములలో కంటే కూడా ఉత్తమోత్తమమైనవి.

### కాంచీ క్షేత్ర ప్రమాణవివరణం

ప్రాగుక్తం కామరాజాఖ్యం కాంచీక్షేత్రే హి వర్తతే
కాంచీక్షేత్ర ప్రమాణస్తు ప్రోచ్యతే భూపతేధునా
గంగాయా దక్షిణే భాగే యోజనానాం శతద్వయే
పూర్వసింధూర్మహాపుణ్యః కాంచీక్షేత్రాశ్రయో నృప
తత్రోయం తత్సముద్రస్య పాపఘ్నం సర్వదా నృణాం
స్నాతానం సాగరే తత్ర న కాలానియమః కిల
పురా స్వదోష శాంత్యర్థం సరిద్రూపా సరస్వతీ
తత్సింధుమ్ ప్రాప్య ముక్తాభూత్ పతిం బ్రహ్మాణం ఆశ్రితా
సా పూర్వామ్ బుధయే తుష్టా బ్రహ్మపత్నీవరం దదౌ
కాంచి దేశాంతికే సింధౌ న కాలనియమౌ భవేత్
సర్వదా వా సకృద్వాపి స్నానాద్విష్ణుపదం లభేత్
ఏవం వరేణ సంయుక్తోభవత్ తత్సాగరో నృప

### కాంచీక్షేత్ర ప్రమాణవివరణము :

ఓ మహారాజా! ఈ మూడు పీఠములలో మొదటిదగు 'కామరాజపీఠము' కాంచీపురమున కలదు. అట్టి కాంచీ క్షేత్ర ప్రమాణమును తెలిపెదను వినుము.

గంగానదికి దక్షిణ దిక్కున రెండువందల ఆమడల దూరమున మహాపుణ్య ప్రదమగు కాంచీ క్షేత్రము కలదు. దానికి తూర్పు సముద్రము కలదు. ఈ సముద్రమునందు కాల నియమములతో అవసరము లేక ఏ మానవుడు ఎప్పుడు స్నానమాచరించినను వాని పాపములు పోవును. మొట్టమొదటిగా సరస్వతీదేవి నదీరూపమును ధరించి, ఈ సముద్రములో జేరి తన దోషములను పోగొట్టుకొని, తన భర్తయగు బ్రహ్మదేవుని పొందెను. ఆ విధముగా దోషములను పోగొట్టుకొనిన సరస్వతీదేవి ఆ సముద్రమునందు స్నానము చేయుటకు కాలనియమము లేదు. ఈ ప్రాంతమున ఎల్లప్పుడూ నివసించు వారికి ఈ స్నానము వలన విష్ణుపదప్రాప్తి కలుగునని ఆ సముద్రమునకు వరమిచ్చెను.

### దక్షిణ పినాకిన్యుత్పత్తి కథనం

నైరృత్యాం తస్య జలధేః సపాద ఋతు యోజనే
దక్షిణాఖ్యా సరిచ్ఛ్రేష్ఠా పినాకిన్యత్ర వర్తతే
సా నదీ సర్వపాపఘ్నీ శివకార్ముకసన్నిభా ।
పురాహరప్రసాదేన భృగుర్దైత్య గురుర్మహాన్ ॥
పినాకం సందధౌ హస్తే భూగతం హరకార్ముకమ్ ।

*తదుద్ధరణ మాత్రేణ తావద్ భూమిస్సరిద్ బభౌ ॥*

*తతో దృష్ట్వా జలాఢ్యాం తాం నదీం సింధుప్రగామినీమ్ ।*

*పినాకిపీతి తాముక్త్వా భృగుస్తస్యై వరం దదౌ ॥*

*పినాకినీ నదీతోయే యోజనః స్నాన సమాచరేత్ ।*

*విముక్తః సర్వపాపేభ్యో విష్ణులోకం స గచ్ఛతు ॥*

దక్షిణపినాకిని జన్మకథ :

తూర్పు సముద్రమునకు నైరుతి దిక్కున ఆరు ఆమడల దూరమున 'దక్షిణ పినాకిని' అను ఒక నది కలదు. ఇది (సకల పాపములను పోగొట్టెడి) శివధనుస్సంబంధమైనది. శివానుగ్రహముతో దేవగురువగు భృగుమహర్షి ఒకానొక సమయమున భూమిలోనున్న ధనుస్సును చేతితో పైకెత్తగానే ఆ నేలలో ఒక నది పుట్టెను. పూర్తిగా నీటితో నిండి సముద్రములో కలియుటకు వెళ్ళుచున్న ఆ నదిని చూసి భృగువు దానికి 'పినాకిని' అని పేరు పెట్టి, ఈ నది యందు స్నానమాచరించిన మానవులు సకల పాప విముక్తులై విష్ణులోకమునకు చేరుదురని వరములిచ్చెను.

**శిలాహ్రదప్రభావః**

*ఇత్యేవం వరసంయుక్తా సానదీ తత్ర వర్తతే ।*

*తస్యా మారుతిదిగ్భాగే సప్తయోజన మాత్రతః ॥*

*శిలాహ్రదో మహాపుణ్యః చామృతత్వ ప్రదాయకః ।*

*పురా వాతాత్మజో వీరః సుధా సంజీవనౌషధిమ్ ॥*

*ఆదాయ తజ్జలేక్షాళ్యదదౌ తాం లక్ష్మణాయ చ ।*

*హనూమానథ తం దృష్ట్వా తత్తీర్థాయ వరం దదౌ ॥*

*శిలాహ్రదే తు యః స్నాయాత్ స సిద్ధో దీర్ఘజీవనాత్ ।*

*దేవత్వమహితో భూత్వా చాన్తే విష్ణుపదం వ్రజేత్ ॥*

*ఏవం వరేణ సంయుక్తో వర్తతే స శిలాహ్రదః ।*

**శిలాహ్రద ప్రభావము**

తూర్పు సముద్రమునకు వాయవ్య దిక్కున ఏడు ఆమడల దూరమున మహాపుణ్య ప్రదము అమృతత్వము నొసంగెడి 'శిలాహ్రదము అను తీర్థము కలదు. పూర్వము హనుమంతుడు అమృత సంజీవని ఔషధమును దీనిలో కడిగి లక్ష్మణునికిచ్చి జీవింపచేసెను. అనంతరము హనుమంతుడు ఈ తీర్థమందు స్నానమాచరించిన ప్రతివారు దీర్ఘకాలము జీవించి, భగవంతుని స్మరించుచు చివరకు విష్ణులోకమును పొందుదురు అని వరమునిచ్చెను.

**స్వామి పుష్కరిణి ప్రభావః**

*ఐశాన్యాం తస్య తీర్థస్య వసుయోజనమాత్రతః ॥*

స్వామిపుష్కరణీ పుణ్యా సాక్షాత్ తద్ విరజానదీ ।
పురా నారాయణః శ్రీమాన్ పరిణేతుం తు పద్మజామ్ ।
శిష్యైస్సార్థం సిద్ధవేషాత్ స్థిత్వా శేషాచలోపరి ।
పృథక్త్వేన చ శిష్యాణాం పృథక్ తీర్థమకారయత్ ॥
తథా స్వస్య పృథక్త్వేన స్వామిత్వాద్విరజానదీమ్ ।
అనాయ్యాత్ర మహాతీర్థం స్నానపానాయ చాకరోత్ ॥
స్వవివాహావసానే తు స్వతీర్థాయ వరం దదౌ ।
యోऽత్ర భక్త్యా నారః స్నాయాత్ స్వామిపుష్కరిణీ జలే ॥
సర్వాన్ కామానసౌ భుంక్త్వా విష్ణులోకం స గచ్ఛతి ।
ఏవం వరేణ సంపన్నం తీర్థం తత్ర ప్రకాశతే ॥

శిలాహ్రద తీర్థమునకు ఈశాన్య దిక్కున ఎనిమిది ఆమడల దూరమున స్వామి పుష్కరణి కలదు. పూర్వము నారాయణుడు పద్మావతిని వివాహము చేసుకొనదలచి, శిష్యులతో కూడా శేషాద్రి పర్వతంపై నివసించి, స్నాన పానాదికములకై ఒక్కొక్క శిష్యునిచే ఒక్కొక్క తీర్థమును తెప్పించుకొనుచూ, విరజానదిని కూడా తెప్పించుకుని, వీని నన్నిటిని ఒక్కటిగా చేసి, 'స్వామి పుష్కరిణి' అను ఒక మహా తీర్థమును నిర్మించెను. ఏ మానవుడు ఈ పుష్కరిణి యందు భక్తితో స్నానమాచరించునో, ఆ మానవుడు భూలోకమున ఐహిక సుఖములను అనుభవించి, చివరిదశలో విష్ణులోకమును పొందును అని వరమునిచ్చెను.





Sri Chandrasekharendra Saraswathi Viswa Mahavidyalaya

Deemed to be University, Enathur, Kanchipuram 631561

A Unit of Sri Kanchi Kamakoti Peetam Charitable Trust

**offers UG, PG and PhD degrees in various domains**

**Sanskrit | Shilpa Sastra | Manuscriptology | Ayurveda**

**Engineering & Technology | Management | Commerce | Law**

**Science | Allied Health Science | Education | Arts & Humanities**

- Experienced faculty
- Advanced laboratories
- Attractive scholarships
- Excellent placement
- MoUs with reputed institutions
- Green campus
- Vibrant sports & culturals
- Homely hostel facility
- Transport facility from nearby districts

For more details, contact:

Mob.: 96290 32323, 96290 01144, 73059 74770

Mail: admission@kanchiuniv.ac.in

Website: www.kanchiuniv.ac.in

Scan the QR for more details on Admissions


Quality higher education rooted in the Indian value system



SRI KAMAKOTI TOURYATRIKA TRUST

# శ్రీ కామకోటి వాణి

## మాస పత్రిక



శ్రీ కామకోటి వాణి మాసపత్రిక చందాదారుగా చేరండి / చేర్పించండి

**సంవత్సర చందా రూ. 680/- రూపాయలు**

Magazine Post ద్వారా పంపబడును.

UPI
srikamakotivaani@icici

వివరాలకు సంప్రదించగలరు :
7200 825 000
E-Mail : skvsubscriptions@gmail.com

BHIM
Scanner for Payments

Bank Details

| | | |
|---|---|---|
| A/c Name | : | Sri Kamakoti Touryatrika Trust SKV |
| Bank | : | ICICI Bank |
| Account No. | : | 440705000345 |
| IFSC Code | : | ICIC0004407 |

JAYA JAYA SHANKARA HARA HARA SHANKARA JAYA JAYA SHANKARA HARA HARA SHANKARA

SRI CHANDRAMOULEESWARAYA NAMAHA



SHRI KANCHI KAMAKOTI PEETAM
JAGADGURU SHANKARACHARYA SWAMIGAL
SHRIMATAM SAMSTHANAM
1, SALAI STREET, KANCHIPURAM, TAMILNADU - 631502 INDIA

www.kamakoti.org

fb.me/srikamakoti

youtube.com/kanchimath

twitter.com/kanchimatham

instagram.com/kanchimutt

www.kamakoti.tv

www.kanchimuttseva.org
ESEVA PORTAL
for Online Puja Bookings & Contributions

JAYA JAYA SHANKARA HARA HARA SHANKARA JAYA JAYA SHANKARA HARA HARA SHANKARA



పాపాంధకారార్కపరంపరాభ్యాం తాపత్రయాహీంద్రఖగేశ్వరాభ్యామ్
జాడ్యాబ్ధిసంశోషణవాడవాభ్యాం నమోనమః శ్రీగురుపాదుకాభ్యామ్
అపార కరుణాసింధుం జ్ఞానదం శాంతరూపిణం ।
శ్రీ చంద్రశేఖరగురుం ప్రణమామి ముదాన్వహం ॥